# 9

# నశించిన వారిని చేరుటకు సంఘమునకు ఒక ఉదాహరణము అవసరమై యున్నది

## (1 కొరింథీయులకు 9:1-27)

1964వ సం॥లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయుటకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా బ్యారీ గోల్డ్‌వాటర్ పేరు పతిపాదింపబడినప్పుడు, "స్వేచ్ఛను ప్రతిరక్షించుకొనుటలో తీవ్రవాదము దౌష్ట్యము కాదు ... [మరియు] న్యాయము కొరకు పోరాడునప్పుడు మితవాదతత్వము ఒక సుగుణము కాదు"[1] అని ఆయన చెప్పారు. ఈ మాటలు నియోజకులకు ఒప్పిదము కాలేదు. ఆయన ఎన్నుకొనబడినట్లయితే, ఆయన అణ్వస్త్ర యుద్ధము ఆరంభించునేమో, అని అనేకులు భయపడిపోయారు. తత్ఫలితంగా, ఎన్నికలలో ప్రత్యర్థియైన లిండన్ బి. జాన్సన్‌గారు అత్యధిక సంఖ్యాబలంతో నెగ్గినందు వలన ఈయన ఓటమిపాలయ్యారు.

తీవ్రవాదము ఒక సుగుణమని ఎంచబడు సందర్భములున్నాయా? 1 కొరింథీయులకు 8:13లో పౌలు ఇలా వ్రాస్తున్నాడు, "కాబట్టి, భోజనపదార్థము వలన నా సహోదరునికి అభ్యంతరము కలిగిన యెడల, నా సహోదరునికి అభ్యంతరము కలుగజేయకుండుటకై, నేనెన్నటికిని మాంసము తినను." ఈ నాడు, మనకు ఈ మాటలు ఒక తీవ్రవాది మాటల వలె అగుపించుచున్నవి!

ప్రభువును సేవించు విషయములో, ప్రభువు నిమిత్తము పౌలు అంతము వరకు వెళ్లినట్లుగా ఇతరులు సహితము ఆయన చూపిన మాదిరిని అనుకరించవలెనని పౌలు ఆశించాడు (1 కొరింథీయులకు 10:33; 11:1 4:16 చూడుము). విగ్రహములకు అర్పింపబడిన పదార్థముల విషయములో, కొరింథీలోని క్రైస్తవులు ఏమి చేయవలెనో మొదట తెలియజెప్పాడు (అధ్యాయము 8). అటుతరువాత సంఘములో అటువంటి సమస్యలు చోటుచేసుకున్నప్పుడు వారు చేపట్టవలసిన చర్యల గూర్చి ఆయన వారికి ఒక ఉదాహరణమును – తన స్వంత మాదిరిని – చూపించాడు (అధ్యాయము 9).[2] తోటి ఇతర సహోదరులకు అభ్యంతరము కలుగకుండునట్లును తననుతాను కాపాడుకొనుటకును ఆయన తీవ్ర చర్యలనైనను తీసికొనుటకు సంసిద్ధుడైయుండెనని పౌలు చూపిన మాదిరి ప్రదర్శించుచున్నది. మనము కూడ ఇలాగే చేయవలెనని ఈ మాదిరి మనలను సవాలు చేయుచున్నది.

### పౌలు చూపిన మాదిరి

పౌలు తనను తానైతేనేమి ఇతరులనైతేనేమి రక్షించు నిమిత్తము ఎంత దూరం వెళ్లగలడు? చూద్దాము. మొదటిగా, ఇతరులను రక్షించుటకు ఏమి చేయవలెనని ఆయన ఇష్టపడుచుండెను? (9:1–18).

**ఇతరులను రక్షించుటకు పౌలు చేసినదేమిటి**

ఇతరులను రక్షణలోనికి తెచ్చుటకు పౌలు తాను ఎంత వరకు, ఏమి చేయగలడో ఈ వాక్యభాగములో వర్ణించుచున్నాడు. మౌలికంగా, ఆయన తన హక్కులను వదులుకొనుట వలన తన పనులు మరింత కార్యసార్ధకమైనవి కాగలిగినట్టయితే, దానికైనా ఇష్టపడుచుండెను.

*ఆయన ఎవరై యుండెనో గుర్తుచేసికొందాము (9:1, 2).* ఆయన తన హక్కులను వదులుకొనుటకైనను సిద్ధముగా నుండుటను కొరింథీయులు హర్షించుచుండిరని పౌలు నిశ్చయపర్చుకొనవలెనని ఆశించాడు, గనుక ఆయన హక్కులు కలిగియుండుటకు గల ఆధారాలను వివరించాడు. ఆయన ప్రభువును చూచినందుచేతో[4] ఆయన ఒక అపొస్తలుడని[3] ఆయన నొక్కివక్కాణించుచు, వారు క్రైస్తవులై యుండుటయే ఆయన యొక్క అపొస్తలత్వమునకు నిదర్శనమని చెప్పాడు (9:1). వారు స్వతంత్రులై యున్నట్లుగానే, ఆయన కూడ స్వతంత్రుడేనని సూచించాడు (9:1). వాస్తవమునకు, వారు క్రైస్తవులైనందుకు అంత స్వాతంత్ర్యమును అనుభవించగలిగినట్లయితే, ఒక అపొస్తలుడుగా, ఆయన తనకిష్టమైనది చేయుటకు యింకెంత ఎక్కువ స్వాతంత్ర్యమును స్వాధికారంతో అనుభవించాలో కదా![5]

*ఆయన ఏంచేసాడో గుర్తుచేసికొందాము.* ఆయన ఎవరైయుండెనో అను విషయమును కొరింథీయులకు గుర్తుచేసిన తరువాత, ఆయన వారి కొరకు ఏంచేసాడో వారు ఒక్కసారి జ్ఞాపకం చేసికొనవలెనని చెప్పుచున్నాడు. ఆయన ఉద్దేశాలను నెరవేర్చుకొనుటకు, పౌలు అనేక హక్కులను వదులుకొన్నాడు.

(1) తినుటకును త్రాగుటకును గల హక్కు (9:3, 4). విగ్రహాలకు అర్పింపబడిన మాంసము తినుటకు కొరింథీయులకు హక్కు ఉండినప్పటికిని, వారు తమ బలహీనులైన సహోదరుల నిమిత్తమైన వారికి గల హక్కును వదిలిపెట్టుటకు ఇష్టపడుచున్నవారై యుండవలెనని పౌలు అంతకు మునుపు చాటి చెప్పాడు (8:7–12). మాంసము తినుటకు గల హక్కును వదిలిపెట్టుటకు ఆయన ఇష్టపడుచున్నాడని అదివరకే వ్యక్తము చేసాడు (8:13).[6]

(2) వివాహము చేసికొనుటకు గల హక్కు (9:5). వివాహము చేసికొనుటకు పౌలుకు హక్కు ఉండినది,[7] పేతురు (కేఫా),[8] కొందరు ఇతర అపొస్తలులు, మరియు యేసు సహోదరులు కూడా ఈ హక్కు కలిగియుండిరి. ఏదిఏమైనా, ఈ హక్కును సద్వినియోగము చేసికొనకుండుటకే ఆయన ఎన్నుకొన్నాడు (అధ్యాయము 7).

(3) వేతనము పుచ్చుకొనుటకు గల హక్కు (9:6–18). ఆయన ప్రబోధములు చేయుచుండిన సంఘము చేత పోషింపబడు హక్కు ఆయనకున్నదని కూడ పౌలు ఉద్ఘాటించాడు. వాస్తవానికి, అధ్యాయంలోని ఈ భాగంలో ఇదోక పెద్ద చర్చనీయాంశమై యున్నది. 'ఎందుకైయుండవచ్చును?' అని మనము ఆశ్చర్యపోవచ్చును. బహుశ, ఆయన కొరింథు సంఘములో పరిచర్య చేయుచుండిన రోజుల్లో వారి నుండి ఆయన ద్రవ్యమును అంగీకరించనందుకు పౌలు విమర్శింపబడి యుండును. నిజమైన అపొస్తలులు వేతనమును తీసికొందురని కొందరు అనుకొని యుండవచ్చును, గనుక ఆయన పరిచర్య చేయుచుండినందుకు వేతనము పుచ్చుకొనుటకు పౌలు నిరాకరించుట ఆయన అసలైన అపొస్తలుడు అయియుండడని వారికి అర్ధమిచ్చియుండును.[9]

వేతనము పుచ్చుకొనుటకు ఆయనకు అన్ని హక్కులున్నాయని పౌలు బలముగా

వాదించాడు. ఆయన అపొస్తలుడై యున్నాడు గనుక, ఆయన చేయు పనికి ఇతర అపొస్తలుల వలెనే జీతము పుచ్చుకొనుటకు ఆయన అర్హుడైయున్నాడు (9:3–6). పనులు చేయుచూ ఆర్థిక ప్రయోజనము పొందుకొను ప్రజల సామాన్య ఉదాహరణములను ఉపయోగించుచు వారు తమ ఇంగిత జ్ఞానమును ఉపయోగించవలెనని ఆయన వారిని విజ్ఞప్తి చేసాడు: సైనికులు, వ్యవసాయదారులు, మరియు గొఱ్ఱెల కాపరులు (9:7). ఆ తరువాత సువార్తను ప్రకటించువాడు ఆయన చేయుచుండు బోధల ద్వారా తన జీవనోపాధిని సమకూర్చుకొనవచ్చునను అభిప్రాయమునకు మోషే ధర్మశాస్త్రము బాసట నిచ్చుచున్నదని ఆయన వారికి చూపించాడు. ధాన్యమును నూర్చెడి యెద్దు నోటికి చిక్కము పెట్టబడకూడదని ధర్మశాస్రము బోధించుచున్నది,[10] మరియు ఆ ఆదేశములు వాస్తవమునకు క్రైస్తవ యుగము నాటి దేవుని ప్రజల ప్రయోజనము నిమిత్తము వ్రాయబడినవని పౌలు చెప్పాడు (9:8బి–10ఎ). మరలా, ఆయన ఒక సాదృశ్యము సహాయంతో సహేతుకముగా వాదించుచున్నాడు: వ్యవసాయదారులు మంచి పంటను కోసికొనవలెనని ఆశించుచు విత్తనములు విత్తుదురు, అలాగే ఆధ్యాత్మిక విత్తనములు విత్తిన బోధకులు వారు చేయు పనుల ద్వారా ఐహిక ప్రయోజనములు కోసికొనవలెను (9:10బి, 11). తరువాత, యాజకులు మరియు లేవీయులు దేవాలయములో చేసిన సేవకులు ప్రతిఫలము పొందుకొను హక్కు వారికి ఉండినట్లే, బోధకులకు వేతనములిచ్చుట సరియైనదే అని చూపించుటకు మోషే ధర్మశాస్త్రము వైపు మళ్లుచున్నాడు (9:13). ఇంత వరకు ఆయన చెప్పినదానంతటిని ఈ తరువాతి వాక్యములో సారాంశముగా చెప్పుచున్నాడు: "అలాగున సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించియున్నాడు" (9:14). ఈ ఘోషణతో సమస్య ఎప్పటికీ తీరిపోయినది. సువార్తను బోధించువారు వేతనము పుచ్చుకొను హక్కు కలిగియున్నారు.[11]

ఆయన వేతనము ఇవ్వబడవలసిన హక్కును నిజముగా కలిగియుండినప్పటికిని, పౌలు స్వప్రయోజనము నిమిత్తము ఆ హక్కును సానుకూలము చేసికొనలేదు. "ఇతరులకు మీ పైని యీ అధికారములో (మీ చేత పోషింపబడు హక్కులో) పాలు కలిగిన యెడల మాకు ఎక్కువ కలదు గదా?" అని ఆయన చెప్పుచున్నాడు (9:12ఎ; 9:15 కూడ చూడుము). ఎందుకుండకూడదు? ఎందుకనగా, (1) ఆయనకు వేతనము ఇచ్చుట కొందరికి ఆటంకముగా ఉండియుండవచ్చును (9:12బి), మరియు (2) సువార్తను ప్రకటించుటలో పౌలు ఇతర ప్రోత్సాహకములు కలిగి యుండెను (9:15–18, 22).

*ఆయన ఎందుకు చేసాడో గుర్తుచేసికొందాము.* పౌలు డబ్బు కోసం బోధించలేదు, కానీ ఆయన బోధింపక తప్పలేదు గనుక బోధించాడు; ఆయన "బలవంతము చేయబడ్డాడు. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ" అని ఆయన చెప్పుచున్నాడు (9:16). సువార్త ప్రకటించుటకు దేవుడాయనను పిలిచాడు, గనుక ఆయన ప్రకటింపవలసి యున్నది! ఒక సమాజము నుండి పొందుకొనగలిగిన డబ్బు కంటె, ఆయనకు అప్పగింపబడిన గృహనిర్వాహకత్వమును నిర్వర్తించుటయే ఆయనకు బహుమానమై యుండినది.[12]

ఆయన సువార్తను ప్రకటించుటకు గల ప్రోత్సాహక హేతువును పౌలు 9:19–23లో మరి ఎక్కువగా వివరించాడు.[13] ప్రజలను రక్షించవలెనను నదే ఆయన తన హక్కులను వదిలిపెట్టుటకు గల కారణమై యున్నది. ఈ విషయాన్ని ఈ వాక్యభాగములో పదే పదే

పేర్కొన్నాడు: కొందరినైనా రక్షింపవలెను లేక సంపాదింపవలెనను తాపత్రయము ఆయనలో ఉన్నదని, వచనములలో ఆరు సార్లు చెప్పుచున్నాడు. పౌలు యొక్క అత్యంత తీవ్రమైన మతాభిమానమును తెలియజేయు ఉద్ఘాటన 9:22లో నున్నది: “ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధములవాడనై యున్నాను.” పౌలు తన హక్కులను త్యజించుటవలన, ఆయన ఎవరినైనా రక్షించగలిగినట్లయితే, ఆ పని చేయుటకు ఆయన ఇష్టపడుచుండినవాడైయుండెను!

**పౌలు తననుతాను రక్షించుకొనుటకు ఏమి చేసాడు**

ఆయన కూడ రక్షింపబడినవాడై యున్నాడని నిశ్చయపర్చుకొనుటకు పౌలు తీవ్రముగా ప్రయాసపడ్డాడు (9:24-27). ఈ వాక్య భాగములో అపొస్తలుడు రెండు క్రీడా రూపకాలంకారములను ఉపయోగించాడు: పరుగు పందెము మరియు ముష్టి యుద్ధం. ఈ క్రీడలలో ఉత్తీర్ణులగువారు శ్రమించవలసి యుండునని ఆయన సూచించుచున్నాడు; వారు ఆత్మనిగ్రహమును అత్యధికంగా పాటించుచు వారి ఆశయముల గురివైపే దృష్టిని నిలిపియున్నాడని పౌలు చెప్పాడు. అయన “గురి చూడనివానివలె” పరుగెత్తుట లేదు కానీ పందెము నందు గెలుచుటకే పరుగెత్తుచున్నాడు! ఆయన ఒకడు “గాలిని కొట్టినట్లు” కాదు గాని సరిగ్గా తన గురినే కొట్టునట్లు ముష్టి యుద్ధం చేసాడు. ఆయన ఆత్మనిగ్రహమును కూడ అభ్యసించాడు. వాస్తవమునకు, అది ఆయనకు బానిసయై యుండునట్లు ఆయన తన శరీరమును క్రమశిక్షణలో పెట్టుకున్నాడని - అక్షరాలా, ఆయన “ముష్టి ఘాతములు చేసికొన్నాడు” ASV లేక “బాదుకొన్నాడు” (NIV) అని - ఆయన చెప్పాడు. సువార్తను ప్రకటించి ఇతరులను రక్షణ లోనికి తీసికొని వచ్చిన తరువాత, ఆయనే భ్రష్టుడు కాకుండునట్లు, లేక “అనర్హుడు” కాకుండునట్లు ఆయన ఈ పనులు చేసాడు.

ఒక క్రీడాకారుడు ఒలింపిక్ క్రీడలలో పోటీ చేసి గెలుపొందుటకు ఎన్ని సంవత్సరముల శిక్షణ అవసరమౌతుందో కదా అని ఈ సాదృశ్యము మనలను ఆలోచింపజేయుచున్నది. ఆయన శాశ్వత రక్షణ పొందుకొన్నాడని రూఢిపర్చుకొనుటకు శ్రమించి పని చేయుటకును త్యాగము చేయుటకును ఆయన సిద్ధంగా ఉన్నాడని పౌలు చెప్పుచున్నాడు.

## మన ప్రతిస్పందన

పౌలు తనను తానైతేనేమి ఇతరులనైతేనేమి రక్షించుకొనుటకు ఏదైనా, ఎంతవరకైనా చేయుటకు సిద్ధంగా యుండినాడని మనము చూచియున్నాము. అలాగైతే, ఇతరులను మరియు మనలను మనము రక్షించుకొనునట్లు పౌలు వలె చేయుటకు మనము ఇష్టపడుచున్నామా?

**ఇతరులను రక్షించుటకు నీవు ఎంతగా ప్రయాసపడుదువు?**

ఇతరులను రక్షింపవలెనంటే, మనము పౌలు 9:22బి లో చూపిన మాదిరిని - “ఏ విధముచేతనైనను” కొందరిని రక్షింపవలెనని “అందరికి అన్ని విధముల” వారమై యున్న మాదిరిని - అనుకరించుటకు ఇష్టపడుచున్నవారమై యుండవలెను. ఇతరులు రక్షింపబడునట్లు, అనేక మంది క్రైస్తవులు, త్యాగపూరితమైన వారి జీవితముల ద్వారా, శుభ సందేశమును వ్యాపింపజేయవలెనని వారు కలిగియుండిన దృఢనిశ్చయతను ప్రదర్శించారు. సుదూర

దేశములలో గల ప్రజలకు సువార్తనందించుటకై, కొందరు స్త్రీపురుషులు వారి స్వదేశములలో వారనుభవించుచుండిన సుఖవంతమైన జీవితములను త్యజించారు. ఇతరులు, నూతనంగా స్థాపింపబడిన లేక స్థాపింపబడి ప్రయాసపడుచుండిన సంఘములు సజీవముగా ఉండుటకు తోడ్పడునట్లు, వారు ప్రతి ఆదివారము, వారి స్వంత ఖర్చులతో, అనేక మైళ్ల దూరము పయనించుటకు వారి స్వంత స్థానిక సంఘములతో కలిసి దేవుని ఆరాధించుటలో గల ఆనందమును త్యాగము చేసారు. నశించినవారికి ఉపదేశించుటకు కొందరు విదేశములలో నిర్వహింపబడు సువార్త ప్రచారోద్యమములలో పాల్గొనుటకు వెళ్లారు లేక ఇతరులు కొందరు స్థానికంగా నిర్వహింపబడు బైబిలు అధ్యయన కూడికలలో ఉపదేశించుటకు వారు తమ కుటుంబములతో సంతోషంగా గడుపగల సాయంకాల విరామ సమయమును త్యాగము చేసారు.

ఇటువంటి వారు తీవ్రవాదులనియు లేదా మతోన్మాదులనియు పరిగణింపబడవచ్చును – కానీ బహుశ వారు పౌలు చూపిన తీవ్రవాద మాదిరిని అనుకరించుచుండిరని మనము మామూలుగా చెప్పవచ్చును. సువార్తను ప్రకటించుటకు గల మహదవకాశముతో పోల్చుకుంటే, ఒకటి లేదా రెండు హక్కులను ఒదులుకొనుటలో గల వెల, చెల్లించుటకు పెద్ద మూల్యమేమీ కాదు.

### నిన్ను నీవు రక్షించుకొనుటకు నీవు ఎంతగా ప్రయాసపడుదువు?

మనలను మనము రక్షించుకొనుటకు, పౌలు 9:24-27లో చూపిన మాదిరిని అనుకరించుటకు ఇష్టపడుచున్నవారమై యుండవలెను: దానిని గెలువవలెనను ఉద్దేశముతో, క్రైస్తవుడై యుండుటకు కష్టించి పని చేయుట, క్రైస్తవ పందెములో ఏకాగ్రతతో పరుగెత్తుట: సూటిగా మన ప్రత్యర్థిపైనే, సాతానుపైనే, గురి పెట్టుచు క్రైస్తవ పోరాటమును బలముగా పోరాడుట. మనము జారిపడిపోకుండునట్లు, మన శరీరములను మితముగా ఉంచుకొనుచు పాపిష్ఠి కోరికలకు ఎడతెరపిలేకుండా కళ్లెము వేయచుండవలెను. ఒలింపిక్ క్రీడలలో పోటీ చేసి పందెమును గెలువ వలెనను నిరీక్షణతో పాల్గొనగోరు క్రీడాకారుడు ఉన్నట్లుగా, మనము మన నిత్య రక్షణ గూర్చి గంభీర దృక్పథముగలవారమై యున్నామా? మనము మన రక్షణ గూర్చి గంభీరముగా ఆలోచించుచున్నట్లయితే, మనము ఆధ్యాత్మికంగా బలముగా ఎదుగుటకు కావలసిన శిక్షణకు – బైబిలును అధ్యయనము చేయుచు ప్రార్థించుటకు – అవసరమైన విధంగా ప్రయాసపడుచు అవసరమైనంత సమయమును వెచ్చించుదుము.

ఈ పనులన్నిటినీ చేయు ప్రతివాడు ఒక ఉన్మాదుడని పరిగణింపబడవచ్చును. ఏదిఏమైన, ఇటువంటి పనులు – ఒక క్రీడాకారుడు తన క్రీడను ఎంచినంత గంభీరముగా, తన స్వరక్షణ గూర్చి గంభీరముగా ఆలోచించుట – చేయుటకు విఫలుడగు ప్రతి క్రైస్తవుడు తన ఆత్మను నశింపజేసుకొను అపాయములో ఉన్నట్లే! మనము ఎంపిక చేసికొనుటకు మన యెదుట రెండు ప్రత్యామ్నాయములున్నవి: మన స్వరక్షణ గూర్చి గంభీరముగా ఆలోచించుచు దానిని పొందుకొనవచ్చును లేదా చులకనగా చూచుచు దానిని పోగొట్టుకొనవచ్చును.

### ముగింపు

తీవ్రవాదము ఒక సుగుణమై యున్నది కానీ ఒక దౌష్ట్యముకాదని ఎంచబడిన ఏదైనా

సమయము ఎప్పుడైనా ఉన్నాదా అని ప్రశ్నించుచు మనము మన అధ్యయనమును మొదలు పెట్టాము. ఆ తరువాత, ఆయన మాటలనుబట్టి పౌలు ఒక తీవ్రవాదని అనేకుల చేత ఎంచబడునని మనము చూపించాము.

ఇంతేగాక, ఇతర క్రైస్తవులు ఆయనవలెనే ఉండవలెనని పౌలు ఆశించాడు! కాబట్టి, “ఇతరులనైతేనేమి మనలనైతేనేమి రక్షించుటకు మనము ఎంతగా – ఎంతటి అత్యంతమైన అంతిమ స్థాయిల వరకు – ప్రయాసపడగలము?” అని మనము ప్రశ్నించాము.

“తీవ్రవాదము ఎప్పుడు ఒక సద్గుణమై యుండును?” అను ఈ ప్రశ్నకు సమాధానమిచ్చుటకు ఇప్పుడు మనము సంసిద్ధముగా ఉన్నాము. “అత్మలు నశించుచుండు ఆపత్తులో ఉన్నప్పుడు!” మన ప్రవర్తన మరొకరి ఆత్మ యొక్క శాశ్వత గమ్యమును ప్రభావితము చేసినప్పుడు, తీవ్రవాద ప్రవర్తన సమర్థనీయమైనదే – అది అవసరము కూడ.

---

సూచనలు

[1]Gary Donaldson, ed., *Modern America: A Documentary History of the Nation Since 1945* (New York: M. E. Sharpe, 2007), 151. [2]“బలహీనులైన తోటి సహోదరులకు అభ్యంతరము కలిగించకుండునట్లు తగు జాగ్రత్త వహించవలెనని కొరింథు విశ్వాసులలో అతితెలివిగా ప్రవర్తించుటకు ప్రయత్నించుచుండిన వారికి ఆదేశములు జారీ చేసిన తరువాత, ఇతరులకు ఆభ్యంతరము కలుగుజేయకుండు సూత్రమును తన స్వంత జీవితము ద్వారా ఆ మాదిరిని చూపించవలసిన అవసరమున్నదని పౌలు అర్థంచేసికొన్నాడు” (Richard E. Oster, Jr., *1 Corinthians,* The College Press NIV Commentary [Joplin, MO.: College Press Publishing Co., 1995], 203). 3అధ్యాయము మొదట్లో గల ప్రశ్నలు తన వాదనను బలపరచుటకు భాషవిశేషాలతో అలంకారయుక్తంగా అడుగబడిన ప్రశ్నలై యున్నవి; స్పష్టంగా, ఆ ప్రశ్నలు భావార్థకంగా జవాబులు ఇవ్వబడవలసినవై యున్నవి. 4అపొస్తలుడై యుండుటకు, ఒకరు పునరుత్థానుడైన ప్రభువును చూచినవాడై యుండాలి; పౌలు దమస్కునకు వెళ్లుచుండిన మార్గములో క్రీస్తు ఆయనకు ప్రత్యక్షమై ఈ అవసరమును తీర్చాడు (అపొస్తలుల కార్యములు 9:3–5, 27; 1:21, 22; 2:32; 26:16–18; 1 కొరింథీయులకు 15:8 చూడుము). 5ఆయన అపొస్తలుడై యుండెనని పౌలు చేయుచున్న ప్రకటన మరియు ఆయనను విమర్శించుచుండిన వారితో ఆయన చేయుచుండిన “ప్రతివాదము” (*apologia*) గూర్చి ఆయన చెప్పుచున్న వివరము (9:3) కొరింథీ సంఘములోని కొందరు పౌలు యొక్క అపొస్తలత్వమును మరియు/లేదా అధికారమును ప్రశ్నించారని సలహా ఇచ్చుచున్నది (1 కొరింథీయులకు 4:3–16 కూడ చూడుము). ఏది ఏమైనా, 1 కొరింథీయులకు 9వ అధ్యాయంలో పౌలు యొక్క ప్రధాన అందోళన ఆయన తన అపొస్తలత్వమును కాపాడుకొనుట కాదు, కానీ కొరింథీయులకు ఒక మాదిరియై యుండవలెనని ఆయన వదులుకొన్న విషయమును నొక్కివక్కాణించవలెనని ఆయన ఆశించాడు. 6“తినుటకును త్రాగుటకును” అయనకు సర్వ హక్కులున్నాయని పౌలు స్వాధికారముతో అడుగుచున్నది ఆయన నొక్కివక్కాణించ దలచిన విషయమును చెప్పుటకు వేరొక విధానమై యుండినదనునది మరొక సాధ్యతయై యున్నది: తన జీవితావసరములను – ఆయన “తినుచు త్రాగుచు నుండగలుగునట్లు – సమకూర్చుకొన గలుగునట్లు ఆయన పోషింపబడుటకు ఆయనకు అన్ని హక్కులున్నవి. (Oster, 206.) 7“ఒకరు తనతో కూడ విశ్వాసియైన భార్యను తీసికొని వెళ్లుట” అని అనువదింపబడిన గ్రీకు పదజాలము “ఒక సహోదరిని తన భార్యగా” తీసికొని వెళ్లుట అని అర్థమిచ్చుచున్నది. “సహోదరి” అను పదము సహచారియైన ఒక క్రైస్తవ స్త్రీని సూచించుటకు రూపకాలంకారముగా వాడబడినది; కాబట్టి, “విశ్వాసియైన భార్య” అను అనువాదము ఖచ్చితంగా అసలైన పదము యొక్క అర్థమును ప్రతిబింబించుచున్నది (Ibid., 208). 8“పేతురు వివాహితుడు. ఆయన మొదటి పోప్ అని కొందరు నమ్ముదురు, అట్లయినప్పటికినీ రోమన్ కథోలిక్క్ యాజకులు (మరియు బిషప్పులు మరియు పోప్‌లు) వివాహము చేసికొనకూడదు. అదేవిధంగా ఆయనకు అత్త ఉండినదని సువార్తలు చెప్పుచున్నవి, గనుక పేతురుకు భార్య ఉండినదని అవి తెలియజెప్పుచున్నవి (మార్కు 1:29–31). 9అలాగైతే, ఇప్పుడున్నట్లే, ఏదైనాగాని సాధారణంగా దాని వెలకు తగినదే అని కొందరనుకొనుట సాధ్యమే. బహుశ, పౌలు వేతనమును పుచ్చుకొనకుండానే సువార్త పరిచర్య చేసినందు వలన, ఆయన బోధలు ఎందుకూ పనికిరానివనియు ఒక బోధకునిగా, ఉపదేశకునిగా, లేదా నాయకునిగా ఆయనకు కూడ విలువేమీ లేదనియు వారనుకొని యుందురు. 10ద్వితీయోపదేశకాండము 25:4.

[11]ఇదే సత్యము మత్తయి 10:10లోను లూకా 10:7బి లోను చెప్పబడియున్నది. [12]ఆయన చేయుచుండిన పరిచర్యకు ప్రతిఫలముగా పౌలు వేతనము స్వీకరించకుండుట యను సూత్రము ఆ దినముల యందు ఆయన బోధించుచుండిన సంఘమునకు

వర్తించినట్లు అగుపించుచున్నది. ఆయన ప్రేషణోద్యమ పరిచర్యలో సంచరించుచుండినప్పుడు ఇతర సంఘముల నుండి పోషణను అందుకొన్నాడు (ఉదా॥ ఫిలిప్పీయులకు 4:15–17 చూడుము). ఆయన కొరింథీలో బోధించినప్పుడు కూడ, ఇతర సంఘముల నుండి పోషణను పొందుకొన్నాడు (2 కొరింథీయులకు 11:7–9). ఆయన ఎఫెస్సులో సేవ చేయుచుండినప్పుడు తనను తానే పోషించుకొన్నాడని పౌలు ఎఫెస్సీయులకు గుర్తుచేసాడు (అపొస్తలుల కార్యములు 18:1–5; 20:33–35). [13]20 మరియు 21 వచనములలో మూడు తరగతులవారు పేర్కొనబడి యున్నారు: "యూదులు," "ధర్మశాస్త్రము క్రింద నున్నవారు," మరియు "ధర్మశాస్త్రము లేనివారు." "ధర్మశాస్త్రము లేనివారు" అన్నప్పుడు అది అన్యులను సూచించుచున్నదని స్పష్టముగా తెలియుచున్నది. "యూదులు" మరియు "ధర్మశాస్త్రము క్రింద నున్నవారు" – ఈ ఇరువురికిని గల తారతమ్యమును ఎలా చూపాలో వ్యాఖ్యాన గ్రంథకర్తలు ఖచ్చితముగా చెప్పలేక పోవుచున్నారు. బహుశ, "యూదులు" అనంటే, వారి వంశముననుసరించి యూదులైయున్నావారని అర్థము చెప్పుట బహు మంచిది (వీరిలో మోషే ధర్మశాస్త్రమంతటిని లేక యూదా మత బోధకుల సాంప్రదాయములను పాటించుటకు తగు శ్రద్ధ వహించనివారనేకులుండిరి), "ధర్మశాస్త్రము క్రింద నుండినవారు" అనగా మతపరంగా యూదులై యుండిరి మరియు మోషే ధర్మశాస్త్రమును మరియు సాంప్రదాయములను పాటించుటకు బహు శ్రద్ధవహించినవారై యుండిరి. (Oster, 221.)